ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 27.0 కనిష్ఠం: 23.0
ANDHRAJYOTHY
5

మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
మంగళవారం 10 సెప్టెంబరు 2024


ఆదివారం ఇద్దరు చిన్నారుల ప్రాణాలను బలిగొన్న తిర్మలాపూర్ చెరువు

ఊపిరి తీస్తున్న చెరువులు

- డేంజర్ స్పాట్‌లుగా కుంటలు, కుళాయి గుంతలు
- నీట మునిగి మూడు నెలల్లో పది మంది మృతి
- వారిలో చిన్నారులే అధికం
- ఈత రాకపోవడమే కారణం

నారాయణపేట, సెప్టెంబరు 9: వరుస వర్షాల వల్ల నిండి, కళకళలాడుతున్న చెరువులు, కుంటలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. సరదాగా ఈతకు వెళ్లిన చిన్నారులు అందులో మునిగి చనిపోతుండగా, కన్నవారికి కడుపు కోత మిగులుతోంది. నారాయణపేట జిల్లాలో ఏప్రిల్, మే, ఆగస్టు నెలల్లో పది మంది మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. ఈత రాకుండా నీటిలోకి దిగడం వల్లే ఈ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. జిల్లాలో ఇటీవల జరిగిన నీటి ప్రమాదాలపై కథనం..

● నారాయణపేట మండలం తిర్మలాపూర్ చెరువులో స్నానం చేసేందుకు వెళ్లిన కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన రాజమ్మ సంతానం ప్రీతి(14), ప్రవీణ్(12) ఆదివారం మృతి చెందారు. రాజమ్మ సోదరుడు ఇటీవల మృతి చెందగా, గ్రామానికి వచ్చిన ఆమె దుస్తులు ఉతుక్కునేందుకు నలుగురు పిల్లలతో కలిసి ఆశిరెడ్డి చెరువుకు వెళ్లింది. ఆమె దుస్తులు ఉతుకుతుండగా, నలుగురు చిన్నారులు చెరువులో దిగి ఆడుకుంటూ కాస్త లోతుకు వెళ్లడంతో నీటిలోకి జారిపోయారు. వారిని కాపాడేందుకు వెళ్లి ఆమె కూడా ప్రమాదంలో చిక్కుకున్నది. అక్కడే ఉన్న గ్రామస్థులు కొందరు రాజమ్మతో పాటు ఇద్దరు పిల్లలు మంగళ, కీర్తిలను కాపాడారు. మూగ బాలిక ప్రీతి, ప్రవీణ్ అలియాస్ రోహిత్ నీటిలో మునిగి చనిపోయారు.

ప్రమాదాల నివారణ ఇలా..

ఈతకు వెళ్లే పిల్లల వెంట పెద్దలు ఉండి, ప్రమాదాలు జరుగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. నీటిలో దిగే ముందు లోతును కర్రల సహాయంతో గుర్తించి, ఆ తర్వాత ట్యూబులు, బెండ్లు కట్టుకొని దిగి ఈత నేర్చుకోవాలి.

● కోస్గి మండలం బలభద్రాయపల్లిలో చిన్నారులు నిహాన్(3), భానుమూర్తి(2) ఇంటి పక్కనున్న నీటి గుంతలో ఆడుకుంటూ ఈ నెల నాల్గో తేదీన మృత్యువాత పడ్డారు. తల్లిదండ్రులు నరసింహ, కవితలకు కడుపుకోత మిగిలింది.

● మరికల్ మండలం రాకొండలో గత మే 8న చెక్ డ్యాంలో ఈత కొట్టడానికి వెళ్లిన ముగ్గురు బాలికలు మృత్యువాత పడ్డారు. పాతర్‌చేడ్ శ్రావణి(14), మహేశ్వరి(12) హైదరాబాద్‌లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్నారు. తర్వాత అమ్మమ్మ ఊరైన రాకొండకు వచ్చారు. బంధువు రాధిక (19)తో కలిసి చెక్ డ్యాంలో ఈతకు వెళ్లారు. ప్రమాదవశాత్తు ముగ్గురూ నీటిలో మునిగి చనిపోయారు.

● గత ఏప్రిల్ 18న నారాయణపేట మండలం బోయిన్‌పల్లి చెరువులో పడి నలుగురు మృతి చెందారు. గ్రామానికి చెందిన సురేఖ(25) మేకలు కాసేందుకు చెరువు వద్దకు వెళ్లింది. ఆమె కుమారుడు విజయ్(11), అక్క కూతురు లిఖిత(10), కొడుకు వెంకటేష్(11) ఈతకోసం చెరువులో దిగారు. లోతు ఎక్కువ కావడంతో ముగ్గురు నీట మునిగారు. సురేఖ వారిని రక్షించబోయి ఆమె కూడా నీట మునిగి నలుగురూ చనిపోయారు.


మహబూబ్‌నగర్‌లో ప్రధాన రహదారి అంచున నిలిపిన కార్లు


ప్రారంభించని సిగ్నల్స్


పట్టణ ప్రధాన రహదారిపై కిక్కిరిసిన వాహనాలు; రోడ్డుపైనే నిలిపిన ద్విచక్ర వాహనాలు

ట్రాఫికర్

- పాలమూరులో అస్తవ్యస్తంగా ట్రాఫిక్
- నిరుపయోగంగా ఫుట్‌పాత్‌లు
- రోడ్డుపైనే పాదచారుల నడక
- ఎక్కడపడితే అక్కడ వాహనాల పార్కింగ్
- సిగ్నల్స్‌కు కలిసిరాని ముహూర్తం

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 9: మహబూబ్‌నగర్ పురపాలికను ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. ఈ పురపాలిక రాష్ట్రంలోనే అతి పెద్దది. పట్టణంలో మూడు లక్షల జనాభా ఉంది. మరోవైపు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రతీ రోజు వేల సంఖ్యలో ప్రజలు జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. పట్టణం విస్తరిస్తున్నట్లుగానే వాహనాల సంఖ్య కూడా రోజు రోజుకూ పెరుగుతోంది. ఇంత పెద్ద పట్టణానికి ఒకే రోడ్డు ఉండటంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. ఉన్న రోడ్డు వాహనాల రాకపోకలకే చాలడం లేదంటే.. రోడ్డుపైనే వాహనాల పార్కింగ్, ఫుట్‌పాత్ నిరుపయోగం కావడంతో పాదచారులు కూడా రోడ్డుపైనే వెళ్లడం, ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ లేకపోవడం.. వెరసి


ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన పండ్ల వ్యాపారులు

పాలమూరులో ట్రాఫిక్ ఓ పజిల్‌లా మారుతోంది. జిల్లాల విభజన సమయంలో.. పాలమూరు జిల్లా కేంద్రంలో ప్రజల సంఖ్య తగ్గుతుందని, జనం లేక వ్యాపారాలు కుదేలవుతాయని జరిగిన ప్రచారం అంతా వట్టిదేనని ప్రస్తుత పరిస్థితి తెలియజేస్తోంది. ఆ ప్రచారానికి భిన్నంగా మాల్స్, వ్యాపార, వాణిజ్య సముదాయాలు పెరగడంతో పాటు ప్రజలు, వాహనాల సంఖ్య ఎక్కువవడంతో రహదారిని విస్తరించినా సమస్య పరిష్కారం కావడం లేదు.

పార్కింగ్ స్థలం లేక రోడ్లపైనే..

ఫుట్‌పాత్ తరువాత రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. షాపింగ్‌కు వెళ్లే ప్రజలు రోడ్లపై టూవీలర్, ఫోర్ వీలర్ వాహనాలు పార్క్ చేస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు రెట్టింపవుతున్నాయి. పాలమూరులో పార్కింగ్ స్థలాలే లేకపోవడంతో వాహనదారులు తప్పనిసరిగా రోడ్లపై వాహనాలను పార్క్ చేస్తున్నారు. పార్కింగ్ స్థలం చూపని పోలీసులు మాత్రం రోడ్లపై ఆగిన వాహనాల ఫొటోలు తీసి, చలానా వేస్తున్నారు. దీంతో రెండేళ్ల క్రితం కొందరు కోర్టును ఆశ్రయించడంతో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని కోర్టు పోలీస్, మునిసిపల్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. అప్పట్లో 24 చోట్ల పార్కింగ్ స్థలాలను గుర్తించామని కోర్టుకు నివేదించిన అధికారులు అందులో ఏ ఒక్క పార్కింగ్ స్థలాన్నీ అందుబాటులోకి తేలేదు. పార్కింగ్ స్థలాలు చూపకుండా రోడ్లపై ఆపిన వాహనాలకు చలానా విధించడంపై ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

ఒకటే రోడ్డు

మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో అప్పన్నపల్లి నుంచి బండమీదిపల్లి వరకు దాదాపు 12 కిలో మీటర్ల మేర ఒకటే ప్రధాన రహదారి ఉంది. ఈ దారి వెంట వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. ఇదివరకు 60-70 అడుగులున్న రహదారిని 100 అడుగుల మేర విస్తరించారు. అయినా.. గడిచిన నాలుగేళ్లలో ట్రాఫిక్ దాదాపు డబుల్ అయ్యింది.

ఉదయం, సాయంత్రం వేళ పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లే జనంతో రెండు గంటలు పట్టణంలో జన జీవనం స్తంభించిపోతోంది. ఈ సమయంలోనే పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పట్టణంలో దాదాపు ఏడు వేల ఆటోలు, వందల సంఖ్యలో స్కూల్ బస్సులు తిరుగుతుంటాయి. విద్యార్థులను స్కూల్స్‌కు తీసుకెళ్లే ఆటోలు, బస్సులు, కార్యాలయాలకు వెళ్లే వారు ఇంటికి తిరిగి వెళ్ళే వారి వాహనాలతో పాలమూరు కిటకిటలాడుతోంది. ఈ సమయంలో పాదచారులకూ తిప్పలు తప్పడం లేదు. ఇది రోజూ పాలమూరు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య దీనికి పరిష్కారం చూపడంలో పాలకులు, అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీస్‌శాఖ కూడా సరైన విధానాలను అవలంబించడం లేదన్న ఆరోపణలున్నాయి.

ఫుట్‌పాత్‌లు ఎవరి కోసం?

ప్రధాన రహదారిని విస్తరించి, ఇరువైపులా ఐదు అడుగుల మేర ఫుట్‌పాత్‌లను నిర్మించారు. వాటికి బారికేడింగ్‌లను కూడా ఏర్పాటు చేశారు. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు ఎవరికోసం ఏర్పాటు చేశారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. వాటిపై భారీ పూల తొట్లను ఏర్పాటు చేయడంతో అవే ఫుట్‌పాత్‌లను దాదాపుగా ఆక్రమించాయి. చాలా పూలతొట్లలో మొక్కలు లేక దిష్టిబొమ్మలుగా మారాయి. పాన్ డబ్బాలు, టీ కొట్లు ఉన్న దగ్గర వాటిని ఉమ్మి తొట్లుగా ఉపయోగిస్తున్నారు. వాటిని అక్కడి నుంచి పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఉంది. ఇక ఫుట్‌పాత్‌లపై పండ్ల వ్యాపారం చేసేవాళ్ళు వాటి నిండా పండ్ల డబ్బాలను పెట్టుకుని, ఎవరూ వాటిపై నడవడానికి వీలులేకుండా ఉపయోగిస్తున్నారు. కొందరు వ్యాపారులు తమ టూవీలర్ వాహనాలను ఫుట్‌పాత్‌లపై పార్క్ చేసుకుంటున్నారు. ఫుట్‌పాత్‌లను అందుబాటులోకి తెచ్చి, పాదచారులు వాటిపై నడిచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రారంభం కాని సిగ్నల్స్

ఎనిమిదేళ్ల క్రితం పాలమూరులో సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. కొన్నాళ్లు బాగానే పని చేసినా, సాంకేతిక సమస్యలు తలెత్తడంతో తర్వాత పని చేయలేదు. రహదారి విస్తరణ సమయంలో సిగ్నల్స్‌ను తొలగించారు. మళ్లీ గత ఎన్నికల ముందు పలు కూడళ్లలో సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. అయితే వాటికి కనెక్షన్ ఇవ్వలేదు. కనెక్షన్ ఇచ్చి, అందుబాటులోకి తేవడానికి సరైన ముహూర్తం కోసం అధికారులు ఎదురుచూస్తున్నారా? అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే చాలా వరకు ట్రాఫిక్ వ్యవస్థ సెట్ అవడంతోపాటు.. వాహనదారులు మోటార్ వాహన చట్టం నిబంధనలు పాటించేందుకు అవకాశం ఉంటుంది.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

తప్పుడు ప్రచారాలు వద్దు

- వక్ఫ్ బోర్డు సవరణలపై అభిప్రాయాలు తెలుసుకునేందుకే కమిటీ
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

మహబూబ్ నగర్ (క్లాక్‌టవర్), సెప్టెంబరు 9: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై తప్పుడు ప్రచారాలు చేయొద్దని, బోర్డులో సవరణలపై అభిప్రాయాలు తెలుసుకునేందుకే కేంద్ర ప్రభుత్వం జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేసిందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు. ఈ విషయమై సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వక్ఫ్ బోర్డు సవరణల కమిటీ.. దృష్టికి వచ్చిన సంఘటనలు, అందరి అభిప్రాయాలను తీసుకుంటుందన్నారు. నిరుపేదలకు లబ్ధి చేకూర్చేందుకే వక్ఫ్ బోర్డులో సవరణ చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ఎవరైనా జేపీసీ ముందు వాదనలు వినిపించవచ్చని తెలిపారు. తెలంగాణ వక్ఫ్ బోర్డు పరిధిలో సుమారు 80 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు కమిటీ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ విషయంపై బాధితులు అయిన ముస్లిములే ఫిర్యాదు చేశారన్నారు. ఇది మతపరమైన అంశం కాదన్నారు. తప్పుడు ప్రచారాలతో వచ్చిన వీడియోను ఎంపీ మీడియాకు చూపించారు. వక్ఫ్ బోర్డు సవరణలపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు జేపీసీ కమిటీ ఈ నెలాఖరున తెలంగాణలో పర్యటించనుందని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ రెడ్డి, పాండు రంగారెడ్డి, కృష్ణవర్ధన్ రెడ్డి, సాహితీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార కేసును జాప్యం చేయొద్దు

- నిందితులకు వెంటనే శిక్ష పడేలా చూడాలి
- పోలీస్ అధికారుల సమీక్షలో డీఐజీ చౌహాన్


డీఐజీ చౌహాన్‌కు పూలమొక్క ఇచ్చి ఆహ్వానిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, సెప్టెంబరు 9: ఇటీవల ఇద్దరు దళిత బాలికల కిడ్నాప్, అత్యాచారం కేసులో జాప్యం లేకుండా నిందితులకు త్వరగా శిక్ష పడేలా చూడాలని డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ జోగుళాంబ గద్వాల జిల్లా పోలీస్ అధికారికి సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఆయన పోలీస్ అధికారులతో కేసుపై సమీక్ష నిర్వహించారు. అలాగే ఈ నెల ఆరున జరిగిన లైంగిక దాడి కేసుపైనా సమీక్షించారు. ఇందుకు సంబంధించిన విషయాలను జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు వివరించారు. గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీలతో కూడిన రేప్, పోక్సో కేసు నమోదైందన్నారు. ఇందులో ఒక యువకుడు, ఒక మైనర్ గద్వాల పట్టణంలోని ఓ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న ఇద్దరు బాలికలను వారి గ్రామ పొలిమేరల నుంచి మోటార్ సైకిల్‌పై కిడ్నాప్ చేశారని తెలిపారు. తర్వాత పట్టణ శివారులోని ఓ గదిలో బంధించి అత్యాచారానికి పాల్పడ్డారని చెప్పారు. మరుసటి రోజు మరో నలుగురితో కలిసి గ్రామంలో సంచరించి, బాధితుల తల్లిదండ్రులను భయాందోళనకు గురి చేశారన్నారు. వారిపై అట్రాసిటీ, పోక్సో, రేప్ కేసులను నమోదు చేశామన్నారు. అనంతరం డీఐజీ చౌహాన్ మాట్లాడుతూ.. కేసు సున్నితత్వం, తీవ్రత దృష్ట్యా సూక్ష్మంగా పర్యవేక్షించాలన్నారు. పకడ్బందీగా లోతైన దర్యాప్తు కోసం, విజయవంతమైన ప్రాసిక్యూషన్‌ను నిర్ధారిస్తూ వేధింపులకు పాల్పడిన వారికి వీలైనంత త్వరగా శిక్షలు పడేలా చూడాలని డీఎస్పీ సత్యనారాయణకు సూచించారు. ఇలాంటి కేసులలో జాప్యం లేకుండా విచారణ జరిపి, నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. ఫాస్ట్‌ట్రాక్, పోక్సో కోర్టు ద్వారా సత్వర న్యాయ విచారణ జరిపించి, నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలన్నారు. ఈ కేసులో ఉన్న నిందితులు మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన వడ్డె తిరుమలేష్, గద్వాలకు చెందిన మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ వారిలో ఉండగా.. వీరితో పాటు గద్వాలలోని దౌదర్‌పల్లికి చెం దిన కోరి గోపాల్, రెండో రైల్వే గేట్‌కు చెందిన తెలుగు నరేష్, శేరెల్లివీధికి చెందిన కమ్మరి నరసింహ, భవానీ నగర్‌కు చెందిన వడ్డ అభిషేక్‌లపైనా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

నార్లాపూర్ నిర్వాసితులకు న్యాయం చేయాలి

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరిన మంత్రి జూపల్లి

కొల్లాపూర్, సెప్టెంబరు 9: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన నార్లాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన నిర్వాసితులందరికీ జీవో నెంబరు 120 ప్రకారం పరిహారం చెల్లించి, న్యాయం చేయాలని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. రిజర్వాయర్‌లో ముంపునకు గురైన భూములు, ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులు మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి హైదరాబాద్‌లోని జల సౌధలో సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సోమవారం కలిశారు. మంత్రి ఉత్తమ్‌కు నిర్వాసితుల సమస్యలను మంత్రి జూపల్లి వివరించారు. కొల్లాపూర్ మండలం బోడబండ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని సున్నపు తండా, దుల్యానాయక్ తండా, అంజనగిరి తండా, వడ్డె గుడిసెల గ్రామాలకు చెందిన 117 మంది నిర్వాసితులకు జీవో నెంబరు 123 ప్రకారం కాకుండా జీవో నెంబరు 120 ప్రకారం పరిహారం చెల్లించాలని కోరారు. వేర్వేరు జీవోలతో పరిహారం చెల్లించడంతో నిర్వాసితులు నష్టపోతున్నారని చెప్పారు.

పాత చోటే ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేయాలి

ప్రభుత్వం అటవీ భూముల్లో ఉన్న ఎల్లూరు, నార్లాపూర్ గ్రామాల నిర్వాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించినా.. వారికి పరిహారం చెల్లించలేదని, వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. నార్లాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు ఎల్లూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 622, 623లో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా కాలనీ ఏర్పాటు చేయడానికి గతంలో నోటిఫై చేశారన్నారు. గత ప్రభుత్వం సర్వే నెంబరు 371, 376లకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీని మార్చిందన్నారు. గతంలో మాదిరిగానే సర్వే నెంబరు 622, 623లలోనే ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీని మార్చాలని మంత్రులను కోరారు. బోడబండ తండాలో ఇంకా మిగిలి ఉన్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, ఇతర నిర్వాసితుల మాదిరిగానే పునరావాసం ప్యాకేజీని వర్తింపజేయాలని.. బొల్లారం అటవీ భూముల్లో నివాసం ఉంటున్న శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితులకు అక్కడే ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అటవీ శాఖకు ప్రత్యామ్నాయంగా వేరే చోట భూమి కేటాయించాలని నిర్వాసితులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. నిర్వాసితులకు సాయం త్వరగా అందించేందుకు తన వంతు కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. వారి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ స్పెషల్ సెక్రటరీ పాటిల్ ప్రశాంత్ జీవన్‌ను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంత్రి ఉత్తమ్‌ను కలిసిన వారిలో కొల్లాపూర్ మాజీ జడ్పీటీసీ హనుమంతు నాయక్, ఎల్లూరు మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, కొల్లాపూర్ సింగిల్ విండో డైరెక్టర్ రఘుపతిరావు, నార్లాపూర్ మాజీ ఎంపీటీసీ రామన్‌గౌడ్, మాజీ సర్పంచ్ రాములునాయక్ తదితరులు ఉన్నారు.


నిర్వాసితులతో కలిసి మంత్రి ఉత్తమ్‌కు వినతి పత్రం ఇస్తున్న జూపల్లి



కల్వకుర్తి పట్టణ ప్రభుత్వ ఆస్పత్రి ముందు నిరసన వ్యక్తం చేస్తున్న శానిటేషన్ సిబ్బంది

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- విధులు బహిష్కరించి ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది నిరసన

కల్వకుర్తి, సెప్టెంబరు 9: పెండింగ్ వేతనాలను చెల్లించాలని కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి శానిటేషన్ సిబ్బంది సోమవారం ఆస్పత్రి వద్ద నిరసన తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏజెన్సీ కింద పని చేస్తున్న 28 మంది సిబ్బంది విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు అడిగితే విధుల నుంచి తొలగిస్తామంటూ బెదిరిస్తున్నారని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి, పెండింగ్‌లో వేతనాలను ఇప్పించాలని కోరారు.

లైంగిక దాడి నిందితులను కఠినంగా శిక్షించండి

- డీజీపీని కోరిన ఎంపీ డాక్టర్ మల్లు రవి

గద్వాల, సెప్టెంబరు 9 : జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇద్దరు దళిత బాలికలపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి పోలీసులను కోరారు. సోమవారం రాష్ట్ర డీజీపీ జితేందర్, జోగుళాంబ డీఐజీ చౌహాన్, జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంఘటనకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కోరారు. లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తులతో పాటు వారికి సహకరించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించకూడదని ఆయన సూచించారు. పాఠశాలకు బయలుదేరిన పిల్లలపై దుండగులు లైంగిక దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని అన్నారు. వ్యక్తిగత ఫొటోలను షోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించి లైంగికదాడికి పాల్పడటం సభ్యసమాజానికి తలవంపు అని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇలాంటి సంఘటనలకు తావుండదని అన్నారు. మహిళలు, బాలికల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చట్టాలను అమలు చేస్తుందని ఎంపీ అన్నారు.

జీతం ఇవ్వలేదని కార్మికుడి ఆత్మహత్యాయత్నం


నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పారిశుధ్య కార్మికుడు బాలపీరు

బిజినేపల్లి, సెప్టెంబరు 9 : జీతం ఇవ్వలేదని నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన సూరంపల్లి బాలపీరు (57) అనే పంచాయతీ పారిశుధ్య కార్మికుడు సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు అల్లీపూర్ గ్రామ పంచాయతీలో అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడిగా బాలపీరు కొంతకాలంగా విధులు నిర్వహిస్తున్నాడు. నెలకు రూ. 8500 చొప్పున ఏడు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురయ్యాడు. జీతం ఇవ్వాలని పలుమార్లు పంచాయతీ కార్యదర్శిని కోరాడు. జీతం ఇవ్వడంలేదని రెండు నెలల నుంచి విధులకు కూడా హాజరుకావడం లేదు. ఈక్రమంలో తోటి కార్మికులందరికీ జీతాలు చెల్లించి తనకు మాత్రం ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన బాలపీరు సోమవారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ముందే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇది గమనించిన తోటి కార్మికులు వెంటనే అతన్ని నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు బాధితుడి బంధువులు తెలిపారు.

కళకళలాడుతున్న చెరువులు, కుంటలు

-కోయిల్‌సాగర్ నుంచి దిగువకు నీటి విడుదల

దేవరకద్ర, సెప్టెంబరు 9 : జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌కు వరద ఉధృతి పెరిగింది. శుక్రవారం ప్రాజెక్టు రెండు షట్టర్లు తెరిచి నీటిని దిగువకు విడుదల చేశారు. రెండురోజుల క్రితం నీటిమట్టం 31.6 అడుగులు ఉండగా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి ప్రాజెక్టు నీటిమట్టం 32 అడుగులకు చేరింది. అంకిళ్ల, కోయిల్‌కొండ పెద్దవాగుల నుంచి నీటి ఉధృతి పెరగడంతో ప్రాజెక్టు అధికారులు రెండు షట్టర్ల నుంచి దిగువకు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు షట్టర్లు తెరవడంతో సందర్శకులు నీటి ఉధృతిని చూసేందుకు తరలివస్తున్నారు.

తెగిన ఖిల్లా లంగర్‌కుంట

కోయిలకొండ : మండల కేంద్రంలోని ఖిల్లా గుట్టపై ఉన్న లంగర్ కుంట నీటి ప్రవహం ఎక్కువై సోమవారం ఉదయం తెగిపోయింది. దీంతో 8వ వార్డులో వచ్చిన వరద నీటికి ఇళ్లలోని సామగ్రి తడిసిపోయాయి. నీటి ప్రవాహంలో మేకలు, కోళ్లు కొట్టుకుపోయాయి. అబ్దుల్ చాంద్, అంజనేయులు, వెంకటయ్య ఇళ్లు బురదమయంగా మారాయి. విలువైన సామగ్రి బురదనీటితో నిండిపోయామని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ రాజా గణేష్, ఎంపీడీవో కాళప్ప పరిశీలించారు.

అలుగు పారుతున్న కొండ చెరువు

కోయిలకొండ పెద్ద చెరువు సోమవారం అలుగు పారింది. మండలంలో కొండ చెరువు అలుగు పారుతుండడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెరువుపైన ఉన్న ఖాజీపూర్ తిమ్మయ చెరువు, అనంతాపూర్ చెరువులు వారంరోజుల నుంచి అలుగు పారుతున్నాయి. కొండ చెరువు కింద 250 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. ఈ సంవత్సరం రెండు పంటలు పుష్కలంగా సాగు అవుతాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



మూసాపేట: పెద్దవాగులో నీటితో నిండిన చెక్‌డ్యామ్

ఉధృతంగా పెద్దవాగు ప్రవాహం

మూసాపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చెరువులు, కుంటల్లో వరద చేరి నిండుకుండలా మారి కళకళలాడుతున్నాయి. అదేవిధంగా పెద్దవాగులో వరద ఉధృతంగా రావడంతో వాగులోని నిజాలాపూర్, మహ్మద్ హుస్సేన్‌పల్లి, కొమిరెడ్డిపల్లి వద్ద చెక్‌డ్యామ్‌లు నిండి పోవడంతో పరిసరాల్లోని బోరుబావుల్లో భూగర్భజలాలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూసాపేట చౌటచెరువు నిండి వారం రోజుల నుంచి అలుగు పారడంతో కొత్త కాల్వ ద్వారా ఇతర గ్రామాల చెరువులకు నీరు చేరే క్రమంలో సంకలమద్ది వద్ద కాల్వ తెగి పంటపొలాల్లో నీరు చేరాయి. ప్రస్తుతం చెరువు ద్వారా నీటిని తూర్పు అలుగు నీటిని వాగులోకి వదులు తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కోయిల్‌కొండలో బురదమయంగా మారిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

'ఉపాధి'లో అవకతవకలకు తావివ్వొద్దు



టెక్నికల్ అసిస్టెంట్‌తో వివరాలు తెలుసుకుంటున్న అదనపు డీఆర్‌డీవో

అత్మకూరు, సెప్టెంబరు 9: జాతీయ ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు తావివ్వకుండా సజావుగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు డీఆర్‌డీవో నాగేంద్రం పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో సామాజిక తనిఖీ బృందం వారు చేపట్టిన నివేదికలను చదివి వినిపించారు. అనంతరం అదనపు డీఆర్‌డీవో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో మండలంలో వేలాది మంది ఉపాధి కూలీలు వంద రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. కొన్ని గ్రామాలలో ఒకే ఇంట్లో రెండు జాబ్ కార్డులు ఒకరి పేరుపై మరొకరు కూలీ పని సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. రైతుల పొలాల్లో పనులు చేస్తున్న క్రమంలో వారంలో అయ్యే పని మరో వారానికి పొడిగించడం, వ న మహోత్సవం కార్యక్రమంలో నాటిన మొక్కలను రక్షించకపోవడం, కూలీ పనుల నిమిత్తం అర్జీ పెట్టుకున్న కూలీలకు పని కల్పించకపోవడం వంటి నిర్లక్ష్యం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు వ్యవహరిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. అదే విధంగా కూలీకి వెళ్లకపోయినా వారి అకౌంట్లో డబ్బులు డ్రా చేసినట్లుగా సామాజిక తనిఖీ బృందం వారు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఇలాంటి అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు పోస్టాఫీసు ద్వారా డబ్బులు జమ కావడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. అది తక్షణమే ఫీల్డ్ అసిస్టెంట్లు సరి చేసే విధంగా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఎప్పటికప్పుడు మండల పరిషత్ అధికారులు, ఏపీవోలు గ్రామాలలో పర్యటించి ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వివరాలు అడిగి తెలుసుకోవాలని ఆదేశించారు. అలాగే ఆయా గ్రామాలలో వన మహోత్సవంలో నాటిన మొక్కలు ఎండిపోయాయని వాటి స్థానంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో అంబుడ్స్ పర్సన్ సత్యనారాయణ రెడ్డి, విజిలెన్స్ ఎంక్వయిరీ ఆఫీసర్ రహీం, ఏపీడీ సుల్తాన్, ఎస్ఆర్ పి.రంజిత్, ఎంపీడీవో సుజాత, ఎంపీవో శ్రీరాంరెడ్డి, ఏపీవో విజయ భాస్కర్ రెడ్డి, ఈసీ రఘు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కిరాణా దుకాణంలో చోరీ

కోస్గి, సెప్టెంబరు 9: పాన్ షాప్‌లో చోరీ జరిగిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌కు ఆనుకొని ఉన్న జయరామ కిరాణ దుకాణ యజమాని మల్లేష్ ఆదివారం ఎప్పటిలాగే రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం వచ్చి దుకాణం తెరిచి చూడగా పైకప్పు రేకు కట్‌చేసి సిగిరెట్లు, సీసీ కెమెరాలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్‌టీం సాయంతో పరిశీలించారు.

మట్టి టిప్పర్ల పట్టివేత

నారాయణపేట, సెప్టెంబరు 9: అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను పేట తహసీల్దార్ అమరేందర్ కృష్ణ సోమవారం పట్టుకున్నారు. పేట నుంచి దామరగిద్ద రోడ్డులో వీటిని పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

ఘనంగా శివపార్వతుల విగ్రహాల ఊరేగింపు



ఊరేగింపు చేపడుతున్న అర్చకులు

అచ్చంపేట అర్బన్, సెప్టెంబరు 9: శ్రీశైలం ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో సోమవారం శివపార్వతుల ఉత్సవ మూర్తులకు ఆలయ ఈవో శ్రీనివాసరావు ఆధ్వ ర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భజన బృందం వారు పల్లకీసేవ లో మేళతాళాలతో ఊరేగింపు గా పాపనాశిని గుండం వరకు తీసుకెళ్లి ఉత్సవమూర్తులకు చక్ర స్నానం చేయించి తిరిగి ఆలయం వరకు తీసుకొచ్చి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా పాపనాశిని గుండంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఈశ్వరునికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, గణపతి అయ్యప్పస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు.

రెట్టింపు సభ్యత్వాలు నమోదు చేయించండి



జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డికి సభ్యత్వ రశీదు అందజేస్తున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్ నగర్ (క్లాక్ టవర్), సెప్టెంబర్ 9: భారతీయ జనతా పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదు గతంలో కంటే రెట్టింపు చేయించాలని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఎంపీ, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. అన్ని వర్గాల ప్రజలను, ఉద్యోగులను పార్టీలో చేర్పించి సభ్యత్వాన్ని చేయించాలన్నారు. సభ్యత్వాలు పెంచడంలో ప్రతి కార్యకర్త అంకితభావంతో కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో పద్మజారెడ్డి, పాండురంగారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రమేష్, వేణుగోపాల్‌రెడ్డి, బురుజు రాజేందర్ రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, సాహితీరెడ్డి, పద్మవేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నర్వ : బీజేపీ సభ్యత్వం దేశాభివృద్ధికి నాంది అని ఎంపీ డీకే అరుణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంతారెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో చందర్‌రావు, కొండయ్య, లలితమ్మ, కుర్వ సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డులు ఇవ్వడం సంతోషం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం: ప్రైవేట్ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులకు వారిసేవలను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేయడం సంతోషమని ఎంపీ డీకే అరుణ అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాల అసోసియేషన్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదాన కార్యక్రమ పోస్టర్‌ను ఎంపీ ఆవిష్కరించారు.

రైతులపై అలసత్వం చూపొద్దు

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



అలుగు తెగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చిన్నారెడ్డి

గోపాల్‌పేట, సెప్టెంబరు 9: పంటలు పండించే సమయంలో రైతులపై అలసత్వం చూపొద్దని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అధికారులను సూచించారు. మండలంలోని తాడిపత్రి పరిధిలో ఉన్న లక్ష్మీసముద్రం చెరువు అలుగు తెగిపోయింది. ఈ సందర్భంగా ఆయన గ్రామ రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడే ఉన్న ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడారు. తక్షణమే అలుగు మరమ్మతు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. అలుగు పనులు త్వరగా పూర్తి చేస్తామని. ప్రభుత్వం ఎప్పుడూ రైతుల పక్షం ఉంటుందని చిన్నారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో చింతల కృష్ణయ్య, మాజీ సర్పంచ్ రామకృష్ణ, ఎలిషా తదితరులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయంతోనే మానవాళి మనుగడ



ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

బిజినేపల్లి, సెప్టెంబరు 9 : రైతులు తమకు అవసరమైన ఆహార ఉత్పత్తుల మేరకైన ప్రకృతి వ్యవసాయం చేపడితేనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం ప్రకృతి వ్యవసాయపై నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం పంటల సాగులో పరిమితికి మించి రసాయనాల వినియోగం వల్ల నేల ఆరోగ్యంతో పాటు రసాయనాలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు కనీసం ఆహార అవసరాల కోసమైన ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని కోరారు. ప్రకృతి వ్యవసాయంలో బీజామృతం, జీవామృతం, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రంతో పాటు ఇతర కషాయాలను వినియోగించి చీడ పీడలను తగ్గించుకోవడమే కాకుండా ఆరోగ్యకరమైన పంటలను పండించుకోవచ్చని వివరించారు. అనంతరం చీడపీడల నివారణ, ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే లాభాలను శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. కేవీకే శాస్త్రవేత్తలు బి.రాజశేఖర్, శైల, ఆదిశంకర్, జ్యోత్స్న తదితరులు ఉన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన



వేరుశనగ పంటపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త

కందనూలు, సెప్టెంబరు 9 : నాగర్‌కర్నూల్ మండలంలోని చందుపట్లలో రైతులకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, భారతీయ వేరుశనగ పరిశోధన సంచాలయం గుజరాత్ వారి సహకారంతో వేరుశనగ పంటలో అధిక దిగుబడులకు మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పరిశోధన సహ సంచాలకుడు ఎం.మల్లారెడ్డి మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందడానికి యాంత్రీకరణ వ్యవసాయం చేయాలని సూచించారు. శాస్త్రవేతలు కే.శ్రీధర్, కే.సదయ్య, టి.విజయలక్ష్మి, ఎన్.నళిని, వి.దివ్యరాణి, రైతులు పాల్గొన్నారు.

కొద్దిపాటి వర్షానికే జలమయం

- కోస్గి మునిసిపాలిటీలో కుంటలు, నాలాలు ఆక్రమణ

- కాలనీల్లోకి చేరుతున్న వర్షపు నీరు



జంగమోనికుంటను మూయడంతో పద్మావతి కాలనీలో చేరిన నీరు (ఫైల్)

కోస్గి, సెప్టెంబర్ 9: స్థానిక మున్సిపాలిటీలో కుంటలు, నాలాలు ఆక్రమించడంతో కొద్దిపాటి వర్షానికే కాలనీలు జలమయం అవుతున్నాయి. ఇందులో భాగంగానే వారం క్రితం కురిసిన వర్షానికి సాయినగర్, బృందావన్‌కాలనీ, పద్మావతికాలనీ, హనుమాన్‌నగర్‌లో భారీగా నీరుచేరింది. నీరు పంపే మార్గంలేక అధికారులు తర్జనబర్జన పడ్డారు. దీనికంతా కారణం ఇరిగేషన్ కాల్వలు మూసివేయడం, కుంటలలో ఇళ్లు కట్టుకోవడమేనని అధికారులు చెబుతున్నారు. కోస్గి రైతుల గంగపుత్రిక దంబంచెరువు ఆల్వలు నాగులబావివద్ద ఇష్టానుసారంగా మార్చడం, గొల్లవీధివద్ద మార్చడం, మహబూబ్‌నగర్ రోడ్డు వద్ద దండంచెరువు కాల్వను పెద్ద నాయకులు ఇష్టానుసారంగా ఇరిగేషన్ అనుమతిలేకుండా మార్చారు. జంగమోనికుంటలో ప్లాట్లు చేసి కుంట ఆనవాలు లేకుండా పాటు కాల్వలు మూసి ఆక్రమించుకోవడంతో పద్మావతికాలనిఅంతా రెండురోజులపాటు వర్షపు నీటిలో మునిగింది. ఎర్రకుంట కాల్వలు, తూము పూర్తిగా మూసివేయడంతో బృందావన్‌కాలనీ నీటిలో మునిగింది. మహబూబ్‌నగర్ ప్రధాన రహదారి లద్దమడుగు ప్రధాన కాల్వ మూడు చెరువుల అలుగు నీరు పారె కాల్వను ఆక్రమించి భవనం కట్టారు. ఈ భవనం కూల్చాలని రెండేళ్ల ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు మున్సిపల్ అధికారులకు ఆదేశాలిచ్చినా నేటికి ఆచరణకు నోచుకోవడంలేదు.

ఆక్రమణలు కూల్చాలి



హైదరాబాద్‌లో కుంటలు, చెరువులు ఆక్రమిస్తే కూల్చేస్తున్నారు. అదే తరహా లో కోస్గిలో అధికారులు చర్యలు తీసుకుని, కుంటలను యథావిధిగా ఉంచితే ఇళ్లల్లోకి నీరు చేరదు. లేకుంటే రానున్న రోజులలో మరింత ఇబ్బంది తప్పదు.

- ఆనంద్, కోస్గి

వివరాలు సేకరిస్తున్నాం



చెరువులు, ఇరిగేషన్ కాల్వలు ఎక్కడెక్కడ ఉన్నాయో, వాటిని ఎవరు ఆక్రమించారన్న పూర్తి వివరాలు సేకరిస్తున్నాం. త్వరలో పూర్తి వివరాలతో నివేదికను ఉన్నతాధికారులకు పంపుతాం. వారి ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటాం. నిజానికి కాల్వలు సగానికి పైగా మూసివేశారు. వాటిని యథావిధిగా తీస్తే తప్ప వర్షాకాలంలో నీరంతా బయటకు పోదు.

- బానుచందర్, ఇరిగేషన్ ఏఈ

కబ్జాలకు పాల్పడిన వారిని జైలుకు పంపిస్తా..

- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



భూకబ్జాల అంశంపై వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, సెప్టెంబరు 9 : భూకబ్జాలకు పాల్పడిన వారిని జైలుకు పంపిస్తానని ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. భూకబ్జాలపై చేసిన ఆరోపణలకు పూర్తి ఆధారాలతో సహా వెల్లడిస్తున్నానంటూ సోమవారం పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే నెంబరు 149లో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టారని, ప్రధానరహదారి కట్టాల్సిన ఆసుపత్రిని వెనక్కి కట్టారని ఆరోపించారు. సర్వే నెంబరు 149లో 7ఎకరాల 33గుంటల భూమి ఉందన్నారు. అందులో మచ్చేందర్‌నాథ్ ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు సంబంధించిన సర్వే నెంబరు 149లో మూడు ఎకరాలు ఉందని, అందులో ఎకరా10గుంటలు మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి సోదరి సద్గుణ కొనుగోలు చేశారని, అలాగే మరో ఎకరా8గుంటలకు అరుణ్‌కుమార్ కొనుగోలు చేసాడని వివరించారు. మిగిలిన 22గుంటలు రోడ్డు నిర్మాణంలో ఉందన్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టిన 22గుంటల భూమి రికార్డులో కొనసాగిందని, రెవెన్యూ రికార్డులో రౌండప్ కాలేదని, ఆ స్థలాన్ని అక్రమంగా మాజీ మంత్రి మేనల్లుడు రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపించారు. అలాగే 3ఎకరాల 23 గుంటల భూమి బాలయ్య ప్రభుత్వం అసైన్డ్ చేసిందని వివరించారు. వీరిద్దరికి పోగా ఎకరా10గుంటలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. ప్రభుత్వంకు చెందిన ఎకరా10గుంటల భూమిని మాజీమంత్రి మేనల్లుడు వద్ద పనిచేసే శివయ్య 2013లో అసైన్డ్ చేసినట్లుగా పహానీలో పేరు ఎక్కించారని ఆరోపించారు. 2013లో ప్రభుత్వం అసైన్డ్ చేస్తుందా అని ప్రశ్నిస్తూనే, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే జరిగిందనేవిధంగా రికార్డులను ట్యాంపరింగ్ చేశారని ఆరోపించారు. శివయ్య పేరుపై నమోదైన ఎకరా10గుంటల భూమిలో రెండు గుంటల భూమిని నాగర్‌కర్నూల్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కృష్ణయ్య విక్రయించినట్లుగా డాక్యుమెంట్స్ ఉన్నాయని వివరించారు. ప్రభుత్వంకు సంబంధించిన భూములను కబ్జా చేసి, ప్రహరీ నిర్మాణం చేసుకున్నారని ఆరోపించారు. జాతీయరహదారి నుంచి ఆసుపత్రికి రోడ్డు నిర్మాణం చేపడుతామన్నారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామని, రికార్డులను ట్యాంపరింగ్ చేసిన వారిని జైలుకు పంపిస్తానని హెచ్చరించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి బంధువులు చేసిన భూకబ్జాలను ఆధారాలతో సహా నిరూపించానన్నారు. కబ్జాల అంశంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నానని, కలెక్టర్ చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో బాలయ్య వారసులు మాట్లాడుతూ తమకు ఎవరూ డబ్బులు ఇవ్వలేదని, బలవంతంగా రాయించుకుని భూములను లాక్కున్నారంటూ ఆరోపించారు. ప్రస్తుతం ఉండడానికి సరైన గూడు లేక ఇబ్బందుల్లో ఉన్నామంటూ సుక్కమ్మ, అంజమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో బాదిమి శివకుమార్, నిత్యానందం, బుక్కవెంకటేశ్, బుర్లవెంకటయ్య, రబ్బానీ, అశోక్‌యాదవ్, అయ్యన్న, మినాజ్, యాదయ్య, రాజేందర్‌గౌడ్‌పాల్గొన్నారు.

ఆక్రమణలకు గురౌతున్న వాగును కాపాడండి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు

వనపర్తి టౌన్, సెప్టెంబరు 9: పట్టణంలోని తాళ్ల చెరువు వాగును ఆక్రమణల నుంచి కాపాడాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు కలెక్టర్‌ను కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. తాళ్ల చెరువు నుంచి రాజనగరం అమ్మ చెరువు వరకు ప్రవహించే అలుగు నీటి పరివాహక ప్రాంతం ఆక్రమానికి గురైందన్నారు. దీంతో చెరువు అలుగు పారిన ప్రతిసారి రోడ్లపైకి, ఇళ్లలోకి అలుగునీరు చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించడమే కాకుండా రాకపోకలకు సైతం ఆటంకం ఏర్పడుతుందన్నారు. గతంలో అలుగునీటిలో కొట్టుకుపోవడం వల్ల ప్రాణ నష్టం కూడా జరిగిందని, ఈ విషయంపై ఫిర్యాదు చేసినా ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోలేదన్నారు. ఇటీవల ప్రభుత్వం హైడ్రా రూపంలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తూ చర్యలు చేపడుతుందని, అదేవిధంగా పట్టణంలోని తాళ్ల చెరువు అలుగులో ఆక్రమానికి గురైన నిర్మాణాలను తక్షణమే తొలగించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. ఎంతో చరిత్ర కలిగిన చెరువులను, కుంటలను, శిఖం భూములను రక్షించాలని డిమాండ్ చేశారు.

బిల్లులు చెల్లించి పాడి రైతులను ఆదుకోండి



తహసీల్దార్ రాజునాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాడి రైతులు, నాయకులు

మిడ్జిల్, సెప్టెంబరు 9: విజయ డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు రెండు నెలలుగా బిల్లులు రావడంలేదని సోమవారం కల్వకుర్తి, జడ్చర్ల ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. వారికి బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మద్దతు పలికారు. ప్రైవేటు వ్యక్తులకు పాలు అమ్మితే వెంటనే బిల్లులు వస్తున్నాయని, విజయ డెయిరీ వారు ఎందుకు బిల్లులు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం పాడిరైతుల విషయంలో మొండి వైఖరిని వీడాలని, ప్రోత్సాహకాలను అందజేయాలని డిమాండ్ చేశారు. వెంటనే బిల్లులను అందజేసేలా చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజు నాయక్ ధర్నా వద్దకు చేరుకుని వారితో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సుదర్శన్, రవిందర్‌గౌడ్, తిరుపతి, శ్రీనివాస్‌గౌడ్, నారాయణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పట్నం బంగారు, జగన్‌గౌడ్, అంజియాదవ్, జంగయ్య, బంగారు, తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

రుణమాఫీ కోసం ఎదురుచూపులు



పెంట్లవెల్లిలో ధర్నా చేస్తున్న రైతులు (ఫైల్)

పెంట్లవెల్లి, సెప్టెంబరు 9: రుణమాఫీ కోసం మండల రైతులకు ఎదురుచూపులు తప్పడంలేదు. దశల వారిగా మాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికే మూడు విడతలు మాఫీ చేసినప్పటికీ మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రుణాలు పొందిన ఒక్క రైతుకు కూడా మాఫీ వర్తించలేదు. మంచాలకట్ట, మల్లేశ్వరం, వెంకల్, పెంట్లవెల్లి, రామాపురం, సోమశీల చెందిన 499 మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా ఉన్నారు. వీరికి రూ.3కోట్ల 26లక్షల రుణమాఫీ కావాల్సి ఉంది. కానీ ఒక్క రైతుకు కూడా మాఫీ వర్తించలేదు. దీంతో రైతులు నిత్యం సింగిల్‌విండో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. రుణమాఫీ అవుతుందో కాదోనని ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా తమకు రుణమాఫీ వర్తింప చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రూ.40 వేల రుణం తీసుకున్నాం..



రెండేళ్ల క్రితం పెంట్లవెల్లి సింగిల్‌విండో కార్యాలయంలో రూ.40వేల రుణం తీసుకున్నాను. రుణమాఫీ నాకు వర్తించలేదు. స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావుకు రైతులందరం కలిసి వినతి పత్రం అందజేశాం. ఇప్పటివరకు మాఫీ చేయలేదు.

- ఆర్.వెంకటస్వామి, పెంట్లవెల్లి

అందరికీ మాఫీ అవుతుంది..



ఎస్‌బీఐ అనుసంధానంతో పెంట్లవెల్లి సింగిల్‌విండో నిర్వహిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ మా సొసైటీలో ఒక్క రైతుకు కూడా వర్తించలేదు. రాష్ట్రంలో ఇలాంటి సొసైటీలు మొత్తం 55 ఉన్నాయి. ఈ మధ్యకాలంలో రుణమాఫీ రాష్ట్ర కమిషనర్ ఉదయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశాం. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న అందరి రైతుల రుణాలు మాఫీ అవుతాయి.

- విజయరామారావు, సింగిల్‌విండో చైర్మన్

వాగులో గల్లంతైన మహిళ మృతి

నవాబ్‌పేట, సెప్టెంబరు 9: తన కూతురును అత్తగారింటికి పంపిద్దామని వచ్చిన తల్లి వాగులో గల్లంతై మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం నవాబ్‌పేట మండలంలోని చౌటపల్లి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం గంగన్నగూడెంకు చెందిన పుష్పమ్మ(48) ఆదివారం సాయంత్రం తన కూతూరు సింధూను నవాబ్‌పేట మండలం గోపన్‌పల్లికి పంపిద్దామని, ఆమెతో పాటు రాజాపూర్ మండలం దొండ్లపల్లి గేటు వద్ద చౌటపల్లి సమీపంలో చిన్నవాగును దాటేందుకు యత్నించారు. కూతురు గ్రామస్థుల సాయంతో దాటగా పుష్పమ్మ వాగులో గల్లంతయ్యింది. గ్రామస్థులు వెంటనే ఆమె కోసం గాలించినా ఫలితం లేకపోయింది. సోమవారం ఉదయం ఎస్సై విక్రమ్ ఆధ్వర్యంలో గాలించగా వాగులో పుష్పమ్మ మృతదేహం లభించింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అడవి జంతువు దాడిలో ఆవు దూడ మృతి

మన్ననూర్, సెప్టెంబరు 9: అమ్రాబాద్ అభయారణ్య ప్రాంతంలో అడవి జంతువు దాడిలో ఆవుదూడ మృతి చెందింది. అమ్రాబాద్ మండలం తుర్కపల్లి చెందిన కర్ణయ్య సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆవుల మందను మూడు రోజుల క్రితం మేతకోసం తీసుకెళ్లాడు. ఓ ఆవు దూడ మందతోరాకుండా తప్పిపోయింది. అడవిలో గాలించగా ఆవుదూడ కళేబరం లభించింది. పెద్దపులి చంపేసిందని గుర్తించి, నష్టపరిహారం మంజూరు చేయాలని కోరుతూ బాధితుడు సోమవారం మన్ననూరులోని అటవీ డివిజన్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.

ఇసుక తరలిస్తున్న నలుగురిపై కేసు

బల్మూరు, సెప్టెంబరు 9: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గురుస్వామి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉప్పునుంతల మండలం మొల్గర నుంచి నాలుగు ట్రాక్టర్లల్లో ఇసుక తరలిస్తున్నట్లు తెలిపారు. ఈదుల లక్ష్మయ్య, పొత్పుల రాజు, రమేష్, రాజ్‌శ్రీకాంత్‌లకు చెందిన నాలుగు ట్రాక్టర్ల ద్వారా అనుమతి లేకుండా బల్మూరు మండలంలోని గట్టుతుమ్మెన్ ద్వారా అక్రమ ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. నాలుగు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి తరలించినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

జడ్చర్ల, సెప్టెంబరు 9 : రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన మండలంలోని కోడ్గల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులను సోమవారం సన్మానించారు. ఈ నెల 14, 15వ తేదీలలో హన్మకొండలో జరిగే అంతర్‌జిల్లాల రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పాఠశాల విద్యార్థులు విజయ్, నిక్కేశ్వర్, చరణ్, పవన్, ప్రశాంత్, సిద్ధు, కిషన్, అరవింద్ ఎంపికయ్యారని హెచ్ఎం శ్రీనివాసులు తెలిపారు. విద్యార్థులకు క్రీడాదుస్తులను పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రారెడ్డి అందజేశారు.

ఎట్టకేలకు రోడ్డు మరమ్మతు

- ఎనిమిది రోజుల తర్వాత బస్సుల రాకపోకలు

హన్వాడ, సెప్టెంబరు 9: మండలంలోని ఇబ్రహీంబాద్ సమీపంలో భారీ వర్షాలకు తెగిన రోడ్డును ఎనిమిది రోజుల తర్వాత పునరుద్ధరణ చేయడంతో బస్సులు, వాహనాల రాకపోకలు సోమవారం ప్రారంభమయ్యాయి. 1న భారీ వర్షాలకు రెండు బ్రిడ్జిల వద్ద రోడ్డు తెగిపోయిన విషయం తెలిసిందే. తెగిన మూడు రోజుల తర్వాత కాంట్రాక్టర్, అధికారులు మరమ్మతు చేసి తాత్కాలికంగా చిన్న వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించారు. మళ్లీ వర్షం కురవడంతో రాకపోకలు నిలిచాయి.

ముంపు బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

వనపర్తి టౌన్, సెప్టెంబరు 9: శ్రీశైలం ముంపు బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డిని కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసిన ముంపు బాధితులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ.. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో 1980-81 సంవత్సరంలో శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడు పాలమూరు జిల్లాలోని 67 గ్రామాలు పూర్తిగా నీటిలో మునిగాయని తెలిఆరు. జీవో నెంబరు 98 ప్రకారం ముంపునకు గురైన గ్రామంలోని ప్రతి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని 2014 నుంచి ప్రభుత్వాన్ని కోరుతూనే ఉన్నామని తెలిపారు. అందుకోసం ఉమ్మడి జిల్లా నుంచి డీఎస్సీ కమిటీ ద్వారా 2 వేల మందితో జాబితా కూడా తయారు చేయడం జరిగిందని, 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కరికి కూడా ఉద్యోగ అవకాశం ఇవ్వలేదన్నారు. చిన్నారెడ్డి స్పందిస్తూ ప్రభుత్వంతో మాట్లాడి బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

రెడ్డి జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొండకింది మాధవరెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 9: జిల్లా కేంద్రానికి చెందిన కొండకింది మాధవరెడ్డి 'రెడ్డి జాగృతి' రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకం అయ్యారు. ఆయన మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గంలోని అనేక మంది పేద లుగా అనేక సమస్యలతో జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నా రు. తమ సామాజిక వర్గంలోని పేదల అభివృద్ధి, సంక్షేమ కో సం రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో తన వంతుగా కృషి చేస్తాన న్నారు. రాష్ట్ర బాధ్యతను తనకు అప్పగించిన రెడ్డి జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్‌రెడ్డికు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పాఠశాలల పర్యవేక్షణ పకడ్బందీగా నిర్వహించాలి

» డీఈవో రవీందర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 9 : ప్రతీ రెండు, మూడురోజులకోసారి తప్పనిసరిగా పాఠశాలలను పర్యవేక్షించాలని ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు డీఈవో రవీందర్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, మండల నోడల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానిటరింగ్ అధికారులు పాఠశాలల పర్యవేక్షణను చక్కగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధనా కృత్యాలు సక్రమంగా నిర్వహిస్తున్నరా, లేదా అన్న విషయాన్ని గమనించాలని సూచించారు. విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు వచ్చేవిధంగా చూడాలన్నారు. అధికారులు ఉపాధ్యాయులతో స్నేహపూర్వక వాతావరణంలో మానిటరింగ్ నిర్వహించాలన్నారు. వివరాలను తెలంగాణ ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఏడాది పొడవునా పాఠశాలకు ఒక్కరోజు కూడా సెలవు పెట్టని ఉపాధ్యాయులను ప్రత్యేకంగా సన్మానించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఎంవో బైకానిబాలుయాదవ్, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

» ఎస్పీకి రైతుల ఫిర్యాదు

రాజాపూర్, సెప్టెంబరు 9 : వ్యవసాయ పంట పొలాల్లోకి కాలుష్య నీటిని వదులు తున్న పలు పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని సోమవారం రైతులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాయపల్లి గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ పోలేపల్లి సెజ్‌లోని అమ్నిల్, ఎవ్రిటోజన్, అరబిందో పరిశ్రమలు కాలుష్యపు నీటిని పొలాల్లోకి వదల డం వల్ల పంటలు పండడం లేదని, నీటిని తాగి పశువులు మృత్యువాత పడుతున్నాయని వాపోయారు. యాజమాన్యాన్ని నిలదిస్తే సెక్యూరిటీ సిబ్బందితో దాడులు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మునిసిపాలిటీకి అధిక నిధులు మంజూరు చేయాలి

» 16వ ఆర్థిక సంఘం నిధులపై హైదరాబాద్‌లో చైర్మన్‌ల సమావేశం

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 9 : కేంద్ర ప్రభుత్వ 16వ ఆర్థిక సంఘం నిధుల్లో మహబూబ్‌నగర్ మునిసిపాలిటీకి అధిక నిధులు కేటాయించాలని మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ సెంట్రల్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అరవింద్‌ను కోరారు. 16వ ఆర్థిక సంఘం నిధులపై చర్చించేందుకు తెలంగాణలోని పెద్ద మునిసిపాలిటీలైన పది మునిసిపాలిటీల చైర్మన్‌లకు ఆహ్వానం పంపారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సమావేశానికి సెంట్రల్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అరవింద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మునిసిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు, మిగతా మునిసిపాలిటీల చైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలమూరు పురపాలికకు సంబంధించిన సమస్యలను చైర్మన్ ఆనంద్‌గౌడ్ వినతిపత్రం ద్వారా అందజేశారు.

చెరువును పరిశీలించిన అధికారులు

జడ్చర్ల, సెప్టెంబరు 9 : వినాయక నిమజ్జనం కోసం జడ్చర్ల మునిసిపాలిటీలోని నాగసాల చెరువును సోమవారం మునిసిపల్ కమిషనర్ రాజయ్య, జడ్చర్ల సీఐ ఆదిరెడ్డిలు పరిశీలించారు. నాగసాల చెరువు నిమజ్జనం చేసేందుకు అనువైనదా, లేదా అనే అంశాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై శివానందం, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు కొండల్, స్థానికులు ఉన్నారు.

కూలిన ఇంటిని పరిశీలించిన మునిసిపల్ చైర్మన్



కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న చైర్మన్ ఆనంద్‌గౌడ్

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 9 : భారీ వర్షాల కారణంగా పాలమూరు పట్టణంలోని రవీంద్రనగర్‌లో ఓ ఇల్లు కూలిపోయింది. ఆదివారం రాత్రి ఇంట్లో జయమ్మ అతని భర్త, కొడుకు రాజు పడుకున్న సమయంలో వానకు దెబ్బతిన్న మట్టి ఇల్లు కూలిపోయింది. ప్రమాదంలో రాజుకు స్వల్ప గాయాలు కాగా భార్యాభర్తలు సురక్షితంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ సోమవారం కూలిపోయిన ఇంటిని పరిశీలించి, బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని చెప్పారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలు శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో నివాసం ఉండొద్దని కోరారు.

దుందుభీ వాగులో గాలింపు చర్యల పరిశీలన

రాజాపూర్, సెప్టెంబరు 9 : మండల పరిధిలోని గుండ్లపోట్లపల్లి గ్రామంలోని దుందుభీ వాగులో శుక్రవారం రాత్రి చెన్నమ్మ(52) ఆత్మహత్య సంఘటనలో రెస్క్యూ టీమ్ మూడురోజుల నుంచి గాలింపు చర్యలు చేపడుతోంది. సోమవారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి గాలింపు చర్యలలో ఉన్న రెస్క్యూ టీమ్‌తో పాటు దుందుభీ వాగులో మృతురాలి ఆచూకీ కోసం గాలింపు చర్యల్లో పాల్గొని పరిశీలించారు. బాధితురాలి కుటుంబీకులకు ఆయన ధైర్యం చెప్పారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



మాట్లాడుతున్న సీడీపీవో రాధిక

హన్వాడ, సెప్టెంబరు 9 : సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో రాధిక అన్నారు. సోమవారం మండలంలోని వేపూర్ గ్రామంలో అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. సమతుల ఆహారాన్ని తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వం అందించే ఫుడ్ అందరికీ అందించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గీత, సునీత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కోరంలేని కమిటీ ఎన్నిక చెల్లదు

పాలమూరు, సెప్టెంబరు 9 : జిల్లా కేంద్రంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా కె.బ్రహ్మయ్య ఎన్నికకు కోరం లేదని జిల్లాలోని విశ్వబ్రాహ్మణులు పేర్కొన్నారు. సోమవారం బ్రహ్మంగారి ఆలయంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి వచ్చిన 60 మంది విశ్వబ్రాహ్మణులు సమావేశమయ్యారు. కొత్త కమిటీ ఎంపిక కోసం ఎన్నికలు జరిగే వరకు పాత చైర్మన్ వడ్లశేఖర్ చైర్మన్‌గా కొనసాగుతారని తెలిపారు. బైలాస్ ప్రకారం ఎన్నికల్లో ఎంపిక చేసిన వారిని కాదని కొద్దిమందితో కొత్త చైర్మన్‌గా ప్రకటించటం సరికాదన్నారు. సమావేశంలో వడ్ల శేఖర్, మణికొండ నరసింహ, వడ్ల నారాయణ, పాండు, లక్ష్మీనారాయణ, రాఘవులు, రమేష్, రఘు, భాస్కర్,శ్యామ్, సత్తయ్య, యాంకి ఆచారి, మల్లికార్జున్, రవికుమార్, రాముచారిలు పాల్గొన్నారు.

గిరిజన తండాలకు మౌలిక వసతులు కల్పించాలి

నవాబ్‌పేట, సెప్టెంబరు 9 : గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన గిరిజన తండా పంచాయతీల్లో ప్రభుత్వం వెంటనే మౌలిక వసతులు కల్పించి, రహదారులు, ప్రభుత్వ భవనాలు వెంటనే ఏర్పాటు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చందర్‌నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన సేవాలాల్ ఆవిర్భావ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 14 కోట్ల మంది ఉన్న లంబాడీల గోరుభాషను ప్రభుత్వం అధికారికంగా గుర్తించేందుకు ఆర్టికల్ 8 ప్రకారం తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపాలని కోరారు. విద్య, ఉద్యోగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌కుమార్, శంకర్‌నాయక్, గోవింద్‌నాయక్ ఉన్నారు.

'కులగణన చేపట్టాకే వర్గీకరణ అమలు చేయాలి'

పాలమూరు, సెప్టెంబరు 9 : దళితుల్లో కులగణన చేపట్టిన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.వెంకటన్న డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎస్సీ 57 ఉపకులాలను 'ఏ'వర్గంలో చేర్చి ఐదు శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఉపకులాలను మాల, మాదిగ కులాలతో కలపొద్దన్నారు. ఉపకులాలకు అన్యాయం చేస్తే మరో పోరాటానికి సిద్ధమవుతామన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై విధివిధానాలు రూపొందించుటకు వెంటనే రిటైర్డ్ జడ్జితో కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఉపకులాల కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో దొంబర దివాకర్, దాసరి నాగరాజు, కురువ బాలరాజు, కురువ బీరయ్య, రాంచందర్, పోచప్ప, గోపాల్, శివప్రసాద్, దాసి రాములు, ఉప్పు వెంకటయ్య పాల్గొన్నారు.

ఆసారే ముబారక్ ప్రదర్శన

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 9 : మహ్మద్ ప్రవక్త జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక వీరన్నపేటలోని హెచ్‌ఎస్ ఫంక్షన్‌హాల్‌లో సున్ని ఒలమామషాయఖ్ బోర్డు ప్రధాన కార్యదర్శి మొహిసిన్‌పాషఖాద్రీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఆసారే ముబారక్ ప్రదర్శన నిర్వహించారు. జామీయ నిజామియాకు చెందిన ప్రొఫెసర్ ఖలీల్‌అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. అనంతరం ప్రవక్త తల వెంట్రుకలు, దుస్తులు, వస్తువులు ఇలా 140 రకాల ఆసారే ముబారక్‌ల ప్రదర్శన రాత్రి 12 గంటలకు వరకు నిర్వహించారు.

ప్రజల కోసం పనిచేసిన మహా వ్యక్తి కాళోజీ

» కలెక్టర్ విజయేందిరబోయి

» ఘనంగా నారాయణరావు జయంతి

» పూలమాలలతో చిత్రపటాలకు నివాళి



కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), సెప్టెంబరు 9 : తన రచనల ద్వారా ప్రజలలో రాజకీయ, సామాజిక చైతన్యాన్ని తీసుకరావడమే కాకుండా, స్వాతంత్ర్యోద్యమంలో, తెలంగాణ ఉద్యమంలో పాల్గొని సామాన్య ప్రజల కోసం పనిచేసిన మహావ్యక్తి కాళోజీ నారాయణరావు అని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని సోమవారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర భాషాదినోత్సవ కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాళోజీ నారాయణరావు ఒక రచయితగా కాకుండా, రాజకీయవేత్తగా, స్వాతంత్ర సమరయోధుడిగా, తెలంగాణ ఉద్యమకారుడుగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఆయన రచించిన నా గొడవ ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసిందని, సామాన్యుడే నా దేవుడు అనే నినాదం ఆయనదని.. పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిదన్న స్ఫూర్తితో జీవితమంతా తెలంగాణకు అంకితం చేశారని కొనియాడారు. అలాంటి మహనీయుని ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, డీఆర్వో రవికుమార్, ఏవో శంకర్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి మధుసూదన్‌గౌడ్, డీఆర్‌డీవో నర్సింహులు, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఇందిర, జిల్లా సంక్షేమ అధికారి జరీనాబేగం, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ భవన్‌లో...

పాలమూరు : ప్రజల కోసం తన జీవితాన్ని అంకితమిచ్చిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని విద్యుత్ శాఖ ఎస్ఈ వెంకటశివరాం, డీఈటీ చంద్రమౌళి అన్నారు. సోమవారం కాళోజీ జయంతి సందర్భంగా విద్యుత్ భవన్‌లో ఆయన చిత్రపటం ముందు ఉద్యోగులు ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో వి.రమేష్, ఎస్ఏవో బీచుపల్లి, డీఈ సుబ్బారావు, గోపికృష్ణ, ఏవోలు గంగాధర్, వెంకటనారాయణ, అధికారులు, ఉద్యోగులు, అసోసియేషన్ నాయకులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ డిగ్రీ కళాశాలలో ...

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ డిగ్రీ కళాశాలలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి ప్రిన్సిపాల్ డా.రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అమినాముంతాజ్, అధ్యాపకులు మద్దిలేటి, పద్మ, అనురాధ, ఉషాలక్ష్మి తదితరులున్నారు.

న్యూరిషి పాఠశాలలో : జిల్లా కేంద్రంలోని న్యూరిషి పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చంద్రకళావెంకటయ్య, డైరెక్టర్లు పూజిత మోహన్‌రెడ్డి, శిరీషప్రవీణ్, సాయిసుశాంత్‌కృష్ణ, ప్రిన్సిపాల్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్లలో...

జడ్చర్ల మునిసిపాలిటీ, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కాళోజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాదేపల్లి బాలికల జడ్పీహెచ్‌ఎస్‌లో అష్టదిగ్గజ కవులతో భువన విజయం లఘునాటకాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థుల నాటక ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. తెలుగు భాషోపాధ్యాయులు రాంచంద్రయ్య, కావలికృష్ణల ఆధ్వర్యంలో ఈ నాటకాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయులు వరలక్ష్మి, కవిత, ప్రవర్ధిని, నస్రీన్, రవీందర్‌సింగ్, స్నేహ, బ్లెస్సీ, భాగ్య తదితరులున్నారు. అలాగే, జడ్చర్ల మునిసిపాలిటీలోని పాతబజారు హరిజనవాడ జడ్పీహెచ్‌ఎస్‌లో కాళోజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు సంస్కారభారతి ఆధ్వర్యంలో తెలుగుభాష ఉపన్యాస పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవింద్‌నాయక్, శివశంకర్, రామకృష్ణ, సతీష్‌కుమార్, పద్మావతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ భవన్‌లో కాళోజీ చిత్రపటం ముందు నివాళి అర్పిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), సెప్టెంబరు 9 : ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులను ఎలాంటి జాప్యం చేయకుండా వెను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి జిల్లా అధికారులను కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దని ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని సూచించారు. జిల్లా స్థాయితో పాటు, మండల, డివిజన్లలో సైతం ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దన్నారు. ఈ సోమవారం 85 ఫిర్యాదులు అందాయని వీటిలో అత్యధికంగా భూములకు సంబంధించినవి కాగా మిగతావి జిల్లా పరిషత్, పోలీస్ డిపార్ట్‌మెంట్, సర్వే, డీఆర్‌డీఏ, ఎడ్యుకేషన్ తదితర శాఖలకు సంబంధించి ఫిర్యాదులు అందాయని, తక్షణమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఐదేళ్లలోపు చిన్నారులు పౌష్టికాహారం లోపంతో బాధపడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై జిల్లా అధికార, మండల ప్రతేక అధికారులకు పలు సూచనలు చేశారు. సంబంధిత శాఖలు కోఆర్డినేషన్‌తో పనిచేసి పోషక మాసాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, డీఆర్‌వో రవికుమార్, డీఆర్‌డీవో నర్సింహులు, ఆర్డీవో నవీన్, కలెక్టరేట్ ఏవో శంకర్, జిల్లా అధికారులు ఉన్నారు.

ఎఫ్‌టీఎల్‌లలో చేపడుతున్న నిర్మాణాలను కూల్చివేయాలంటూ కలెక్టర్‌కు వినతి

జడ్చర్ల : చెరువుల ఎఫ్‌టీఎల్‌లలో చేపడుతున్న నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలంటూ సోమవారం కలెక్టర్ విజయేందిర బోయికి జడ్చర్ల పట్టణంలోని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని నల్లకుంట చెరువులోని ఎఫ్‌టీఎల్‌లో అక్రమంగా ప్రహరీ చేపట్టారని, 60, 70 సంవత్సరాలుగా ఉన్న సమాధులను తొలగించి ప్రహరీ చేపట్టారంటూ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అలాగే ఊరకుంటలో ఇండేన్ గ్యాస్ గోదాము, అనాథ శరణాలయం, బురెడ్డిపల్లి శివారులో మురగవాని కుంట, బొప్పాస్‌కుంట, గోదుమకుంటలో కూడా అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని వివరించారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో తెలుగు సత్తయ్య, ఎండి.చాంద్‌ఖాన్, నయీమొద్దీన్, ఇంజనీర్ నర్సిములు, ఉదయ మిత్ర, అనిల్ కుమార్, బాలు తదితరులున్నారు.

భూత్పూర్ ఊర చెరువును పరిశీలించిన కలెక్టర్

భూత్పూర్ : భారీ వర్షాల కారణంగా స్లూయిస్ వద్ద దెబ్బతిన్న చెరువు కట్టను వెంటనే మరమ్మతు చేయాలని కలెక్టర్ విజయేందిరబోయి ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలో ఉన్న ఊర చెరువును కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. రెండురోజుల క్రితం చెరువుకట్ట వాన నీటికి దెబ్బతినడంతో ఆయకట్టు రైతులు యంత్రాల సహాయంతో చెరువు కట్టను మరమ్మతు చేయించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ సోమవారం దెబ్బతిన్న ఊర చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. దెబ్బతిన్న కట్టను వెంటనే మరమ్మతు చేయాలని, కట్ట మళ్లీ దెబ్బతినకుండా శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లను, అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాజు, ఎంపీడీవో ప్రభాకర్‌రావు, ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఇంజనీరు దయానంద్, డీఈఈ అబుబాకర్‌సిద్దికి, అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ తదితరులున్నారు.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో అన్నదానం చేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి



సురక్ష గణపతి పూజలో డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

పూజలందుకుంటున్న గణనాథులు



జడ్చర్ల మునిసిపాలిటీలోని బాచీస్ట్రీట్‌లో ప్రతిష్ఠించిన నటరాజ రూపంలో ఉన్న గణనాథుడు



వెంకటేశ్వరకాలనీలోని వందన అపార్టుమెంటులో..



కిషన్‌నగర్‌లో ఇంద్రుడి అవతారంలో..



వేపూరిగేరిలోని ఆంజనేయస్వామి దేవాలయంలో..

మహబూబ్‌నగర్/కలెక్టరేట్/మహబూబ్‌నగర్ టౌన్/ పాలమూరు, సెప్టెంబరు 9 : పట్టణంలో వినాయక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూడవ రోజు గణనాథులు పూజలందుకున్నారు. ఈనెల 16న నిమజ్జనోత్సవం ఉన్నందున ఆరోజు వరకు పూజలు నిర్వహించనున్నారు. నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధికారుల కార్యాలయ సముదాయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదానాన్ని సోమవారం కలెక్టర్ విజయేందిరబోయి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్, అన్ని కార్యాలయాల అధికారులు, సిబ్బందితో పాటు ప్రజావాణికి వచ్చిన ప్రజలకు కలెక్టర్ అన్నం వడ్డించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఉద్యోగ సంఘాల నేతలు రాజగోపాల్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సురక్ష గణపతి వద్ద జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ సోమవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారని, నిమజ్జన కార్యక్రమం ముగిసేవరకు ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీ జానకి, అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు. అదేవిధంగా, పద్మావతి కాలనీ ఎస్‌బీఐ బ్యాంకు పక్క గల్లీలో ఏర్పాటుచేసిన వినాయకుని వద్ద మంగళవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన మట్టి గణపతికి విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.వెంకటరమేష్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎస్ఈని గిరిజనులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏడీ అనంతయ్య, బాలరాం, కె.నారాయణ, ఉషానాయక్, ముఖేష్, విజయ్, పెంట్యా, పండరీనాథ్, గోవర్దన్, కె.చందర్‌రాథోడ్, రమావత్ రవిరాథోడ్‌లు పాల్గొన్నారు. 42వ వార్డు భవానీనగర్‌లో నెమలి వాహనంపై గణనాథుడు ఆసీనుడై ప్రత్యేక ఆకర్షణీయంగా ఉన్నాడు. శివాజీ మహారాజ్ యువజన సంఘం ఆధ్వర్యంలో యువకులు ప్రత్యేకంగా గణపతిని ఏర్పాటు చేశారు. మండపం వద్ద ప్రతీరోజు ప్రత్యేక పూజలు, చిన్నారులు, మహిళలకు ఆటపాటలు, క్రీడలు నిర్వహిస్తున్నారు. విజేతలకు చివరిరోజు బహుమతులు అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. యువకులు నరేష్, శ్రీనివాసులు, రాములు, రాజేందర్, శ్రీనికేత్, సుమంత్, గోపి, మధు, గణేష్, అశోక్, సాయివినీత్, కె.శ్రీనివాస్, టి.మహస్రష్, గోనెల మహేష్, శ్రీహరి, నరేందర్, రామకృష్ణ, రాఘవేందర్, అనిల్‌లు ఏర్పాట్లు చేస్తున్నారు. వెంకటేశ్వర కాలనీలోని వందన అపార్టుమెంట్‌లో గణేశునికి అపార్ట్‌మెంట్‌వాసులు ప్రత్యేక పూజలు చేశారు. వేపూరిగేరిలోని ఆంజనేయస్వామి దేవాలయంలో గణేశున్ని ప్రతిష్ఠించారు. ఆలయంలో వినాయక మండపాన్ని మోదుగాకులతో అలంకరణ చేశారు.

దేవరకద్ర/జడ్చర్ల/అడ్డాకులలో...

దేవరకద్ర, కౌకుంట్ల మండల కేంద్రాలతో పాటు, పరిధిలోని అన్ని గ్రామాల్లో సోమవారం మూడో రోజు గణనాథులు పూజలందుకుంటున్నారు. మండపాల్లో గణనాథులకు అర్చకులు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ప్రజలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. సాయంత్రం వేళలో మండపాల వద్ద యువకులు ఆటపాటలతో సందడి చేస్తున్నారు. జడ్చర్ల పట్టణంలోని బాచీస్ట్రీట్‌లో మండప నిర్వాహకులు సోమవారం అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. అడ్డాకుల మండల కేంద్రంలోని అసెంబ్లీ కాలనీలోని గణేశ్ మండపంలో సోమవారం అడ్డాకుల జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు రంగన్న గౌడ్, మహేశ్ యాదవ్, ఇ.శ్రీనివాసులు, నర్సింహా, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.



వల్లభ్‌నగర్‌లో హనుమాన్ అవతారంలో..



వీరన్నపేటలో మట్టి వినాయకుడు

రాష్ట్ర స్థాయి ప్రజావాణి కార్యక్రమం రేపటికి వాయిదా

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), సెప్టెంబరు 9 : హైదరాబాద్‌లోని మహాత్మా బాపురావుపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని బుధవారానికి వాయిదా వేసినట్లు ప్రజావాణి నోడల్ అధికారి దివ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘం సమావేశాలు నిర్వహిస్తున్న దృష్ట్యా మంగళవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని బుధవారానికి వాయిదా వేసినట్లు ఆమె తెలిపారు. అర్జీదారులు మార్పును గమనించి బుధవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకావాలని ఆమె కోరారు.

మొక్కలను నాటి పెంచాలి

హన్వాడ, సెప్టెంబరు 9 : మొక్కలను నాటి పెంచే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని తహసీల్దార్ కిష్యానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని నాయినోనిపల్లి గ్రామంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 మంది రైతులకు వివిధ రకాల పండ్ల మొక్కలను ఉచితంగా అందించారు. అనంతరం మాట్లాడుతూ పండ్ల మొక్కలతో పాటు ఇతర మొక్కలను తమ పొలాల్లో, ఇంటి ఆవరణల్లో నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో గిర్దావరి సాదిక్, గ్రామ కార్యదర్శి ఉమేష్, ఫౌండేషన్ ప్రతినిధి అఖిల, సిబ్బంది మురళి, రవికుమార్, రాజు, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఓటరు లిస్టుల సవరణ వేగవంతం చేయాలి

దేవరకద్ర, సెప్టెంబరు 9 : ఓటరు లిస్టులో తప్పులు లేకుండా సవరణను వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీనువాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అయన బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఓటర్ల లిస్టులో తప్పొప్పుల కోసం ఈ నెల 15వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తిరుపతయ్య, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

జీఎంఆర్‌కు బీజేపీ నాయకుల పరామర్శ

చిన్నచింతకుంట, సెప్టెంబరు 9 : దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర నాయకులు ఎగ్గాని నర్సింహులు, రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, మాధవ్, కొమ్ము భరత్‌భూషన్, శ్రీనివాస్, మాధవరెడ్డి, దేవన్నసాగర్, వాకిటి రాజమౌళి తదితరులు పరామర్శించారు. అదేవిధంగా, కాంగ్రెస్ పార్టీ దేవరదక్ర నియోజకవర్గ నాయకుడు కాటం ప్రదీప్‌కుమార్‌గౌడు తదితరులు జీఎంఆర్‌ను పరామర్శించారు. ఎమ్మెల్యే తండ్రి ఇటీవల మరణించడంతో వారు ఆయనను పరామర్శించారు.

పాఠశాలల శుభ్రతపై దృష్టి పెట్టాలి

కోయిలకొండ, సెప్టెంబరు 9 : కురుస్తున్న వర్షాలతో పాఠశాలల్లోని పరిసరాలు శుభ్రంగా ఉండేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని ఎంఈవో లక్ష్మణ్‌సింగ్ సూచించారు. సోమవా రం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెచ్‌ఎంల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాల శుభ్రంగా ఉంటే విద్యార్థులకు ఎలాంటి అంటురోగాలు ప్రబలవని తెలిపారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఇబ్రహీంనగర్ హెచ్‌ఎం నర్సిములును సత్కరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు శంకర్, హర్షవర్ధన్ తదితరులున్నారు.

క్రీడల్లో రాణించాలి

మహమ్మదాబాద్, సెప్టెంబరు 9 : విద్యార్థులు చదువుతో పాటు తమకిష్టమైన క్రీడల్లో కూడా రాణించాలని నంచర్ల జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సురేందర్‌రెడ్డి అన్నారు మండల పరిధిలోని నంచర్ల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అండర్-16, 17 బాలబాలికల కబడ్డీ పోటీల ఎంపికలు సోమవారం నిర్వహించారు. పోటీలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. పీడీలు అహమ్మద్‌బిన్‌అబ్దుల్, పీఈటీలు పాల్గొన్నారు.

పీఆర్టీయూ తెలంగాణ మండల కమిటీ ఏర్పాటు

రాజాపూర్, సెప్టెంబరు 9 : పీఆర్టీయూ తెలంగాణ రాజాపూర్ మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.పురేందర్, ప్రధాన కార్యదర్శిగా మురళీకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు డి.పురేందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు భూపతిసింగ్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శి రమాకాంత్, సుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.